దసరా సంబరం.. చిత్ర శోభితం



దేవీ నవరాత్రులను పురస్కరించుకుని పొదిలికి చెందిన విద్యార్థిని కె.సులోచన గీసిన అమ్మవారి చిత్రం ఆకట్టుకుంటోంది. చిత్రకళపై మక్కువ ఉన్న ఆమె.. రసాయన రంగులు వినియోగించకుండా కేవలం పసుపు, కుంకుమ, బొగ్గుతో అమ్మవారి చిత్రాన్ని ఆకట్టుకునేలా చిత్రించింది.

– న్యూస్‌టుడే, పొదిలి

బాలాత్రిపురసుందరీదేవి నమోస్తుతే



దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని త్రిపురాంతకం బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారు మొదటి రోజైన గురువారం పద్మ వాహనంపై దర్శనమిచ్చారు. బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించి రాత్రి ఉభయదాతలతో కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఉత్సవం నిర్వహించారు. రెండో రోజైన శుక్రవారం బ్రహ్మచారిణీ అలంకారంలో హంస వాహనంపై అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

– న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం





సినీ కథానాయికను చూసి కేరింతలు కొడుతున్న యువత, నగర వాసులు

హాయ్.. ఒంగోల్



సినీ కథానాయిక కీర్తి సురేష్ ఒంగోలులో గురువారం సందడి చేశారు. నగరంలోని గుంటూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభానికి ఆమె హాజరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న అభిమానులు తమ కలల కథానాయికను కనులారా చూసేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో షాపింగ్ మాల్ పరిసర ప్రాంతాలు జనంతో కిక్కిరిశాయి. ప్రారంభం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదిక పైనుంచి కీర్తి సురేష్ తన అభిమానులకు అభివాదం చేశారు. పలువురితో సెల్ఫీలు దిగారు. 'హాయ్ ఒంగోల్' అని పలుకరిస్తూ కొద్దిసేపు ముచ్చటించి ఉత్సాహపరిచారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు కర్నూలు రోడ్డు


అభివాదం చేస్తూ నవ్వులు చిందిస్తున్న కీర్తి సురేష్

నీటిని ఇంకిద్దాం.. మొక్కలు పెంచేద్దాం

- ఉపాధి పనుల గుర్తింపునకు సభలు
- ప్రణాళిక తయారీకి డ్వామా కసరత్తు

గ్రామాల నుంచి వలసలకు అడ్డుకట్ట వేసేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గ్రామ సభలు నిర్వహించి రానున్న సంవత్సరానికి అవసరమైన పనులను అధికారులు ఏటా గుర్తిస్తుంటారు. జిల్లాలోని వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయంలో ఆశించిన మేర దిగుబడులు లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వేసవికి ముందే భూగర్భ జలాలు అడుగంటి బోరు బావులు అడుగంటుతున్నాయి. తాగునీటి సమస్య కూడా నిత్యకృత్యమైంది. ఈ పరిస్థితులకు విరుగుడుగా వాన నీటిని ఒడిసి పట్టి భూగర్భంలో దాచాలని ప్రభుత్వం తలపోసింది. అందులో భాగంగా రానున్న ఆర్థిక సంవత్సరానికి ఈ తరహా పనులతో పాటు, పండ్ల తోటల సాగు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కల పెంపకం వంటి పనులకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం





ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(పాత చిత్రం)

మొత్తం 78 రకాల పనులు...: 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 78 రకాల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అందుకు అనుగుణంగా జాబితా తయారీలో డ్వామా అధికారులు నిమగ్నమయ్యారు. కొత్త పనుల గుర్తింపునకు గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 2న జిల్లా వ్యాప్తంగా గ్రామ సభల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. నవంబర్ నెలాఖరు వరకు నిర్వహించనున్నారు. గుర్తించిన పనుల వివరాలను మండలాల నుంచి జిల్లా నీటి యాజమాన్య సంస్థకు అందజేయనున్నారు. తదనంతరం మంజూరు ఉత్తర్వులు తీసుకోనున్నారు. వచ్చే ఏడాది సుమారు 2 కోట్ల పనిదినాలు లక్ష్యంగా పనులు గుర్తించనున్నారు.

నీటి సంరక్షణ.. పర్యావరణ పరిరక్షణ...: నీటి సంరక్షణ, నీటి నిల్వ పనుల్లో భాగంగా వాగులు, వంకలు, కుంటలు, చెరువులు, చెక్‌డ్యామ్‌ల్లో పూడికతీత పనులతో పాటు, పొలం చుట్టూ సరిహద్దు, పొలంలో అంతర్గత కందకాలు, ఊటకుంటలు, పంట కుంటలు, ఇంకుడు గుంతలు, ఇంజెక్షన్ బోర్లు, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో భవనాలపై పడిన వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం వంటి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, చెరువులు, కుంటల కట్టలపై, రైతుల పొలాల్లో ఉద్యాన పండ్లతోటల సాగు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పూర్తిగా మొక్కలు నాటడం వంటి పనులను చేపట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం పెంపు పనులకు ప్రాధాన్యమివ్వనున్నారు. ఈ మేరకు ఉపాధి హామీ మండల ఏపీవోలతో పాటు, సాంకేతిక సహాయకులు, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలకు ఆదేశాలు జారీ చేశారు.

అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదు

ఈనాడు కథనానికి స్పందన

పెద్దారవీడు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అవినీతి ఆరోపణలు వస్తే చర్యలు తప్పవని యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు హెచ్చరించారు. ఓ స్టేషన్‌లోని అధికారి, కొందరు సిబ్బంది ఇష్టారీతిన వసూళ్లకు పాల్పడుతున్నారంటూ 'కుమార రాజ్యం.. అన్నింటా కప్పాల భోజ్యం' శీర్షికన 'ఈనాడు'లో గురువారం కథనం ప్రచురితమైంది. దీనికి ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు వై.పాలెం సీఐ పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. మరోవైపు అవినీతి ఆరోపణలపై స్పెషల్ బ్రాంచ్ పోలీసుల ద్వారా జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ నివేదిక కోరినట్లు తెలిసింది. ఎస్పీ ఆదేశాలతో స్థానిక అధికారి క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించారు. అవినీతి అధికారితో పాటు, సిబ్బందిపై నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

వ్యవసాయంలో సుస్థిరాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: రసాయనాల వినియోగం తగ్గించి పంటల దిగుబడి పెరిగేలా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడమే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. కొత్తపట్నం మండలం మోటుమాలలో గురువారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో సుస్థిరాభివృద్ధి సాధించడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిపారు. సాంకేతిక సహకారాన్ని అందుబాటులోకి తెచ్చి వినూత్న సాగు విధానాలను అన్నదాతలకు చేరువ చేస్తున్నట్లు వివరించారు. రైతులు కేవలం వ్యవసాయం పైనే కాకుండా అనుబంధ రంగాల్లోనూ అభివృద్ధి సాధించేలా చూస్తున్నట్లు తెలిపారు. సేంద్రియ వ్యవసాయానికి కొత్తపట్నాన్ని ఆదర్శ మండలంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలు, కూరగాయల పొలాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఎం సుభాషిణి, ఆర్డీవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ మధుసూదనరావు, ఏడీఏ రమేష్ తదితరులు ఉన్నారు.

శిరోధార్యమా! శిరోభారమా!!


- నిస్తేజంలో వైకాపా శ్రేణులు
- నేడు బూచేపల్లి బాధ్యతలు



ఒంగోలు, న్యూస్‌టుడే:

గడచిన సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఘోర పరాజయాన్ని చవిచూసింది. జిల్లాలో ఎనిమిదింట ఆరు చోట్ల పరాజయం పాలైంది. పార్టీకి బాగా పట్టున్న పశ్చిమాన కూడా సైకిల్ జోరుకు ఫ్యాన్ రెక్కలు విరిగిపడ్డాయి. దర్శిలో బూచేపల్లి, యర్రగొండపాలెంలో తాటిపర్తి చంద్రశేఖర్ మాత్రమే స్వల్ప మెజారిటీతో బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. గత అయిదేళ్లలో చక్రం తిప్పిన మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాస రెడ్డి, ఆదిమూలపు సురేష్ తమ ప్రత్యర్థుల చేతిలో పరాజయాన్ని చవిచూశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లాలో వైకాపా పూర్తిగా నీరుగారిపోయి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం కొరవడింది.

జాడ లేని నేతలు...: వైకాపా ఆవిర్భావం నుంచి జిల్లా పార్టీలో అన్నీతానై వ్యవహరించిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి.. ఇటీవల ఆ పార్టీకి ఊహించని ఝలక్ ఇచ్చారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత మూడు నెలలు ఒంగోలుకు దూరంగా ఉన్న ఆయన జనసేన తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అడపాదడపా మాత్రమే కనిపిస్తున్నారు. సీనియర్ నేత అన్నా రాంబాబు మార్కాపురాన్ని వీడి రావటం లేదు. సంతనూతలపాడు నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి మేరుగు నాగార్జున జాడలేదు. గత ప్రభుత్వ హయాంలో మార్కాపురాన్ని తమ గుప్పిట పెట్టుకుని శాసించిన కుందురు కుటుంబానిది కూడా అదే పరిస్థితి. ఇక కనిగిరి నుంచి పోటీ చేసి ఓటమిపాలైన జడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణ యాదవ్ అతీగతీ లేకుండా పోయారు. దీంతో జిల్లాలో వైకాపా పరిస్థితి చుక్కాని లేని నావలా తయారైంది.



విధి లేని పరిస్థితిలోనే ముందుకు..!: జిల్లాలో అత్యంత కీలకమైన ఒంగోలు నియోజకవర్గంలోనే ఆ పార్టీ పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. బాలినేని రాజీనామా తర్వాత ఇక్కడ ప్రత్యామ్నాయం ఎవరు..? అని చూస్తే కనుచూపుమేరలో ఎవరూ కనిపించడం లేదు. సంతనూతలపాడు, కనిగిరిలోనూ అదే దుస్థితి. మార్కాపురం, గిద్దలూరుల్లో మాజీ ఎమ్మెల్యేలున్నా పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో వైకాపా జిల్లా అధ్యక్షుడిగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఒకానొక దశలో ఆయన కూడా ఈ బాధ్యతలు నెత్తికెత్తుకునేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. అధిష్ఠానం ఒత్తిడి మేరకు విధి లేని స్థితిలో ఆయన ముందుకు వచ్చినట్లు తెలిసింది. అధికారంలో లేని వేళ ఆటుపోట్లు., కఠిన సవాళ్లను ఎదుర్కొంటూ ఆయన పార్టీని సమర్థంగా నడిపించగలరా అనే చర్చ సాగుతోంది.

164 రోజులు.. రూ. 388 కోట్లు

- అదనపు కొనుగోళ్లు రూ. 134 కోట్లు
- పొదిలిలో ముగిసిన పొగాకు అమ్మకాలు



పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి వేలం కేంద్రంలో ఈ సీజన్‌కు పొగాకు అమ్మకాలు గురువారంతో పూర్తయ్యాయి. ఈ ఏడాది మార్చి 6న వేలం ప్రక్రియ ప్రారంభించారు. అధికారికంగా అనుమతించిన పరిమాణం 9.65 మిలియన్ కిలోలు. అంతకుమించి ఈ ఏడాది 14.73 మిలియన్ కిలోల అమ్మకాలు సాగాయి. దీంతో వేలం ప్రక్రియ రెండు నెలలు పొడిగించి మొత్తం 164 రోజులపాటు సాగించాల్సి వచ్చింది. మొత్తం రూ.388 కోట్లు రైతుల ఖాతాలకు చేరాయి. అనుమతికి మించి అదనంగా 5.15 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తి చేయడం వల్ల రైతులకు రూ.134 కోట్ల వరకు అదనపు రాబడి లభించింది. ఈ ఏడాది 47 కంపెనీలు వేలంలో పాల్గొని అత్యధిక ధర కిలోకు రూ.364, అత్యల్ప ధర రూ.40, సరాసరి ధర రూ.263.79 చెల్లించాయి. పొగాకు సూర, ముక్కలు బోర్డులోనే అమ్మకాలు చేయడం వల్ల రైతులు రూ.2.50 కోట్లు ఆర్జించారు.

రైతులకు కలిసొచ్చిన కాలం...: 2023-24 పంట కాలంలో పొగాకు రైతులకు కలిసొచ్చింది. అధిక వర్షాల వల్ల ప్రారంభంలో కొంత ఇబ్బంది పడినప్పటికీ ఆ తర్వాత పరిణామాలతో లాభపడ్డారు. గతంలో ఒక ఏడాదికి తదుపరి ఏడాదికి సరాసరి ధర రూ.30 నుంచి రూ. 40 పెరిగేది. అందుకు భిన్నంగా ఈ ఏడాది అత్యధిక ధర రూ.364 వరకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి వ్యాపారులే పోటీ పడి ధరలు పెంచి కొనుగోలు చేశారు. దీంతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సరాసరి ధర సైతం కిలోకు రూ.60 వరకు పెరిగింది.

నలుగురు ఎస్సైలకు స్థానచలనం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో నలుగురు ఎస్సైలకు స్థానచలనం కలిగిస్తూ జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో ఉన్న బి.ప్రేమ్‌కుమార్‌ను కొండపి ఎస్సైగా, వి.అజయ్‌కుమార్‌ను సంతనూతలపాడు ఎస్సైగా నియమించారు. ఆయా స్టేషన్లలో పనిచేస్తున్న కృష్ణబాజీబాబు, దేవకుమార్‌లను వీఆర్‌కు పంపారు.

ఇసుక తవ్వకాలకు దరఖాస్తులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇసుక నిల్వలున్న పట్టా, డీకేటీ భూముల్లో తవ్వకాలకు అనుమతి కోసం గనుల శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం ఒంగోలు ప్రకాశం భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాగులు వంకల్లో ఇసుక తవ్వకాలు, రవాణాను సంబంధిత సరిహద్దు గ్రామాల పరిధిలోనే చేపట్టాలన్నారు. అందుకు స్థానిక వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సహాయకులు బాధ్యత వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా గనుల శాఖ అధికారి రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు టెట్‌కు 794 మంది హాజరు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ పోస్టులకు అర్హత పరీక్ష అయిన టెట్ గురువారం ప్రారంభమైంది. జిల్లాలో ఏర్పాటు చేసిన అయిదు కేంద్రాల్లో తొలిరోజు మొత్తం 911 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 794 మంది హాజరయ్యారు. ఒంగోలు నగరంలోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్, మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చి విద్యాసంస్థ, పెద్దారవీడు మండలంలోని కృష్ణచైతన్య ఇంజినీరింగ్ కళాశాల, మార్కాపురంలోని శామ్యూల్ జార్జి కళాశాల కేంద్రాల్లో.. ఉదయం 9.30 నుంచి 12 వరకు., సాయంత్రం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు సాగాయి. జిల్లా పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

2.5 లక్షల గొంతులపై నిర్లక్ష్యం

- నిధుల్లేక కొరవడిన నిర్వహణ
- కలుషిత నీటితో ప్రజల ఆందోళన

సుమారు 1.5 లక్షల మందికి తాగునీరు అందించేందుకు నాలుగు దశాబ్దాల క్రితమే దర్శిలో నిర్మించిన పథకమది. నెదర్లాండ్ సాయంతో అప్పట్లోనే రూ.10.28 కోట్ల వ్యయంతో చేపట్టి దాదాపు తొమ్మిదేళ్లపాటు పనులు సాగాయి. 1987లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైంది. ప్రతి వ్యక్తికి రోజుకు 40 లీటర్ల తాగునీరు అందించే లక్ష్యంతో దాదాపు 151 ఎకరాల విస్తీర్ణంలో తాగునీటి చెరువును కూడా ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇది ఆసియాలోనే పెద్ద నీటి పథకంగా పేరొందింది. దశాబ్దాలపాటు తాగునీరు అందిస్తోన్న కీలకమైన ఈ పథకంపై పాలకులు క్రమేపీ శీతకన్ను వేశారు. నిర్వహణకు నిధులివ్వక మూలకు చేరేలా చేస్తున్నారు.

– ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, దర్శి:

తుప్పు పట్టిన పైపులతో కలవరం...: నీటి శుద్ధికి ఇక్కడ ఏడు ఇసుక బెడ్లు ఏర్పాటు చేశారు. ఇవి కొన్నాళ్లుగా పనిచేయడం లేదు. దీంతో కలుషిత నీరు సరఫరా అవుతోందనే ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. వీటిని తాగాలంటే దర్శి నగర పంచాయతీ వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా.. పూర్తిస్థాయిలో మరమ్మతులు లేవు. నీటి సరఫరా కోసం దాదాపు 350 కిలో మీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేశారు. తర్వాత మరికొన్ని ప్రాంతాలకు విస్తరించారు. ప్రస్తుతం 2.5 లక్షల మందికి ఇక్కడి నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన పైపులైన్‌లు కావడంతో అధికశాతం తుప్పు పట్టాయి. నిత్యం ఎక్కడో ఒకచోట లీకులు ఏర్పడుతున్నాయి. పగిలి పోతున్నాయి. ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ ట్యాంకుల్లో అధికశాతం నిర్వహణా లోపంతో పాచి పట్టి దర్శనమిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో 'జల'గాటం...: ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను గత వైకాపా ప్రభుత్వంలో నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. దర్శి మండలం తూర్పువెంకటాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో అయిదారు గ్రామాలకు పైపులైను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ఇందుకు రూ.70 లక్షల వరకు నిధులు అవసరం అవుతాయి. కానీ ఏళ్లుగా కార్యరూపం దాల్చడం లేదు. దీంతో ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. ఇందుకు గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.2 కోట్లు వరకు బిల్లులను గుత్తేదారులకు చెల్లించారు. వీరిలో ఎక్కువ మంది వైకాపా నేతలు, వారి అనుచరులే కావడం గమనార్హం. బిల్లులుగా చెల్లించిన మొత్తంలో కొంత నిధులు ఖర్చు చేసుంటే ఆ గ్రామాలకు పైపులైను ఏర్పడేది. ఇప్పటికైనా పాత పైపులైన్లు మార్చి, ఇసుక ఫిల్టర్‌బెడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య మాట్లాడుతూ.. దర్శి ఎన్‌ఏపీ రక్షిత నీటి పథకంలో వినియోగించే ఏడు ఫిల్టర్ బెడ్లలో కొన్ని పనిచేయని మాట వాస్తవమేనన్నారు. అన్ని ఫిల్టర్‌బెడ్‌లకు మరమ్మతులు చేయాలంటే రూ.2 కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని తెలిపారు.

- **పథకం:** దర్శిలోని ఎన్‌ఏపీ
- **నిర్మాణ సంవత్సరం:** 1978
- **ప్రారంభించింది:** 1987
- **చేసిన వ్యయం:** రూ. 10.28 కోట్లు
- **సాయం అందించిన దేశం:** నెదర్లాండ్
- **తాగునీరు అందించే లక్ష్యం:** 1.5 లక్షల మంది
- **ప్రస్తుతం ఆధారపడిన జనం:** 2.5 లక్షల మంది
- **సరఫరా:** దర్శి(49 గ్రామాలు), ముండ్లమూరు(42), పొదిలి(29)తో పాటు తాళ్లూరు, మర్రిపూడి, కొనకనమిట్ల, కనిగిరిలోని కొన్ని ప్రాంతాలకు..



మరమ్మతులకు నోచని దర్శి ఎన్‌ఏపీ తాగునీటి పథకం ఇసుక ఫిల్టర్ బెడ్లు

అమ్మ సాక్షాత్కారం.. అంతటా సంబరం


కంభం : వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలకరించారు. వేడుకల్లో భాగంగా తొలిరోజు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సీఎస్‌పురం మండలంలోని శైవ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో త్రిముఖ దుర్గాంబ, టంగుటూరు మండలం వల్లూరులోని వల్లూరమ్మ, తాళ్లూరు మండలం గుంటిగంగలోని గంగమ్మతల్లిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఒంగోలు, కనిగిరి, దర్శి, పొదిలి, మార్కాపురం, కంభం, కొండపి తదితర ప్రాంతాల్లోని కనకదుర్గమ్మ, వాసవీమాత, ఇతర అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దీంతో ఆలయాల్లో ప్రత్యేక సందడి కనిపించింది.

– న్యూస్‌టుడే, బృందం
– ఈనాడు, ఒంగోలు


టంగుటూరు: వల్లూరమ్మ తల్లి


దర్శిలో కనకదుర్గమ్మకు అలంకరణ


ఒంగోలు బాలాజీరావుపేటలోని పోలేరమ్మతల్లి


ఒంగోలు గంటపాలెంలో విద్యుద్దీపాలంకరణ


గుంటిగంగలో గంగాభవాని అమ్మవారు


భైరవకోనలో బాలా త్రిపుర సుందరీదేవిగా త్రిముఖ దుర్గాంబ


పొదిలి: వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు


కనిగిరి ప్రత్యేక అలంకరణలో అంకాళేశ్వరి అమ్మవారు

మొగిలిగుండాల... ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూడాలా..!

- కలగానే మిగిలిన జలాశయ నిర్మాణం
- పూర్తయితే తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కారం


అక్కడ జలాశయం నిర్మిస్తే ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని తాళ్లూరు, చీమకుర్తి, మద్దిపాడు, అద్దంకి తదితర మండలాలకు తాగు, సాగు నీటి ఎద్దడి తీరనుంది. అయినా అడుగు ముందుకు పడడం లేదు. ఒకటి, రెండు కాదు ఏకంగా మూడున్నర దశాబ్దాలుగా ప్రకటనలకే ఈ ప్రాజెక్టు పరిమితమవుతోంది. ఫలితంగా రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. తాళ్లూరు మండలం శివరాంపురం పంచాయతీ పరిధి గుంటిగంగ సమీపాన కొండల్లో నిర్మించతలపెట్టిన మొగిలిగుండాల జలాశయ నిర్మాణం పరిస్థితి ఇది.

న్యూస్‌టుడే, శివరాంపురం(తాళ్లూరు)


మినీ జలాశయంగా అభివృద్ధి చేయాల్సిన చెరువు ప్రాంతం ఇదే


తాళ్లూరు ప్రాంత ప్రజలు ఎన్నోసార్లు విన్నవించగా జలాశయ నిర్మాణానికి, భూ సేకరణకు సుమారు రూ. 10.5 కోట్లను 2018 అక్టోబరులో తెదేపా ప్రభుత్వం మంజూరు చేసింది. 2019 జనవరిలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు 2019 మార్చిలో పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చాక పనులు ప్రారంభించక పోగా, వాటిని రద్దు చేశారు. 2021 సెప్టెంబరులో నాటి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ నిధులు మంజూరు చేయించి రెండోసారి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. దీంతో గుత్తేదారుడు ఓ వైపు మట్టితో ఆనకట్టను నిర్మించి, అప్పటికే ఉన్న పెద్ద ఆనకట్టను తొలగించారు. కాలువ నిర్మాణం కూడా చేపట్టారు. ఆ తర్వాత పనులు ఆగిపోయాయి. జలాశయానికి సంబంధించిన 60 ఎకరాల భూసేకరణకు రూ.3 కోట్లు కేటాయించినా రైతులకు ఇంత వరకు పైసా కూడా అందజేయలేదు. వైకాపా పాలనలో గుత్తేదారుడు రూ.కోటి పైగా నిధులు వెచ్చించి పనులు చేసినా వాటికి బిల్లులు రాకపోవడంతో పనులను పూర్తిగా నిలిపి వేసి వెళ్లిపోయారు. దీంతో రైతుల ఆశలు మళ్లీ అడియాసలయ్యాయి. దీనిపై జలవనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మిని వివరణ కోరగా.. మొగిలిగుండాల జలాశయ నిర్మాణానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని పరిశీలిస్తామని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

పంటలు పండుతాయనే నమ్మకం లేదు..



జలాశయం ప్రాంత పరిధిలో వందలాది ఎకరాలకు సాగు నీరందే పరిస్థితి లేదు. ఇది పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం రైతులు మెట్ట పంటలనే సాగు చేసి జీవనం సాగిస్తున్నారు. ఆ పంటలు సక్రమంగా పండుతాయన్న నమ్మకం లేకపోతోంది. జలాశయం నిర్మాణం జరిగితే వరి పంట సాగుకు సాధ్యమవుతోంది. ఏటా తిండికి కొదువ ఉండదు. –ఎం.తిరుపతిస్వామి, రైతు, శివరాంపురం

పంటలు ఎండి ఇబ్బందులు పడ్డాం..



చెరువు పరిధిలోనే భూములున్నా నీరందుతుందన్న నమ్మకం లేదు. పంటలు ఎండిపోయి ఇబ్బందులకు గురైన సందర్భాలు కోకొల్లలు. ప్రస్తుతం జలాశయాన్ని నిర్మిస్తే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. ఈ ప్రాంతంలో శాశ్వతంగా తాగు, సాగు నీటి ఇబ్బందులు తీరుతాయి. – మారిశెట్టి వెంకటస్వామి, రైతు

కూటమి నేతలు చొరవ తీసుకోవాలి



రాష్ట్రంతోపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వ పాలకులే తక్షణ చర్యలు చేపట్టాలి. వందలాది మంది రైతులకు సాగునీటి సౌకర్యం కలగడంతోపాటు సుమారు ఇరవైకి పైగా గ్రామాల్లో భూగర్భ జలాలు అభివృద్ధి చెంది తాగునీటి సమస్య తీరుతుంది. ఎన్నో ప్రయోజనాలున్న ఇలాంటి పథకాలు పూర్తి చేసేందుకు పాలకులతోపాటు ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉంది. –వద్దినేని నాగేశ్వరరావు, రైతు

ఒంగోలుకు చెన్నయ్ కీర్తి


జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సినీ కథానాయిక కీర్తి సురేష్, చిత్రంలో మంత్రి జమున, మంత్రి వెంకటరెడ్డి, కృష్ణారావు తదితరులు

ఒంగోలు కర్నూలు రోడ్డు, ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలో చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేయడం ఇక్కడి వారికి ఎంతో మేలు చేస్తుందని సినీ కథానాయిక కీర్తి సురేష్ అన్నారు. ఒంగోలు నగరం గుంటూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. తొలుత యాజమాన్యం కృష్ణారావు, మంత్రి వెంకటరెడ్డి, మంత్రి జమునలతో కలిసి జ్యోతి వెలిగించారు. అప్పటికే పెద్ద ఎత్తున అభిమానులు అక్కడికి చేరుకున్నారు. వారికి కీర్తి సురేష్ అభివాదం చేస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 20వ షోరూమ్‌ను ఒంగోలులో ఏర్పాటు చేసిన మాల్ ప్రారంభానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో అనేక ఆధునాతన మోడళ్ల వస్త్రాలు ఉన్నాయని తెలిపారు. హిందీ, తమిళం, తెలుగులో ప్రస్తుతం మూడు చిత్రాల్లో నటిస్తున్నట్లు చెప్పారు. మంత్రి జమున మాట్లాడుతూ.. రూ.99 నుంచి చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు.

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

ఒంగోలు నగరం: ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో తరగతులు నిర్వహించకూడదని డీఈవో డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినా, 14న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. వర్షాలు, వరదల కారణంగా ఇచ్చిన సెలవుల వల్ల 220 కన్నా పని దినాలు తగ్గిన పాఠశాలల వారు దసరా సెలవుల్లో రెండు రోజులు తరగతులు నిర్వహించవచ్చని తెలిపారు.

నేటి నుంచి ఎంపీడీవోలు, ఈవోఆర్డీలకు శిక్షణ

ఒంగోలు గ్రామీణం: ఉమ్మడి ప్రకాశంలోని ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, డీఎల్‌పీవోలకు ఈ నెల 4 నుంచి 6 వరకు ఒంగోలులోని పీటీసీలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో చిరంజీవి తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ, నీటి సరఫరా, లేఅవుట్లు, భవనాలు క్రమబద్ధీకరణ, వీధి దీపాల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ సూచించిన ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లు రూ. 595 (రవాణా & ప్రభుత్వ సమాచారం కోసం) ★ నెక్ సూచించిన ఈరోజు ధర ఒక గుడ్డు రూ.6/-

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాపై నిఘా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాపై స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో గురువారం జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్లాబ్‌ల అనధికార రవాణాను నియంత్రించేందుకు రెవెన్యూ, పోలీసు, వాణిజ్య పన్నులు, గనులశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అవసరమైన మేర సంచార బృందాలు ఏర్పాటుతోపాటు, రెండు చెక్ పోస్టులు, సీసీ టీవీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్లాబ్‌ల అక్రమ రవాణాపై తరచూ ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. చీమకుర్తి మండలం బూదవాడ, ఆర్ఎల్‌పురం, చీమకుర్తి గ్రామాల్లో 85 బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ క్వారీలు ఉండగా.. జిల్లాకు సరాసరిన రూ.250 కోట్ల మేర రెవెన్యూ వస్తుందని వివరించారు. గత అయిదేళ్లగా జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాపై 1,225 కేసులు నమోదు చేసి, రూ.206.31 కోట్ల జరిమానా విధించినట్లు జిల్లా గనులశాఖ అధికారి రాజశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ డిప్యూటీ కన్జర్వేటర్‌గా రాజశేఖరరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అటవీ శాఖ సామాజిక వన విభాగం డిప్యూటీ కన్జర్వేటర్‌గా కె.రాజశేఖరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియాను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అటవీశాఖ ప్రగతికి మరింత కృషి చేయాలని ఆమె సూచించారు.

రాష్ట్ర కరాటే జట్ల ఎంపిక

రాజంపేట, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 1న నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభచాటిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి శారద, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.రమణరాజు తెలిపారు. వీరు ఈ ఏడాది డిసెంబరు 1, 2 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ కరాటే పోటీలో పాల్గొంటారని వివరించారు.

బాలుర జట్టు : బి.సన్యాసిరావు(కృష్ణా), కె.బద్రినాథ్, డి.అరవింద్(కర్నూలు), ఎస్.రవికుమార్, ఎ.భాస్కర్‌రావు, కె.మేధోసాయి అశీష్, ఎస్.కె.నవాజ్ అహమ్మద్, కె.ప్రణీత్, ఎస్.జగన్, ఎం.ప్రణీత్ (విశాఖ), పి.సాయివెంకటశివ, పి.నాగూర్‌వల్లి (చిత్తూరు), వై.వెంకటచలపతి (కడప)లు ఎంపికయ్యారు. **బాలికల జట్టు:** తనూజ (నెల్లూరు), ఇ.రేవతి, సుగందిని (కర్నూలు), జి.జయసౌద(వెస్ట్ గోదావరి), ఎన్.సంయుక్త, ఎ.యశశ్వని(పశ్చిమగోదావరి), కె.రేణుక, పి.కీర్తి (విశాఖ), ఎం.నిఖిత, పి.సిరి(అనంతపురం), పి.రాజరాజేశ్వరి(కృష్ణా) ఎంపికయ్యారు.

రేపు కందుకూరులో బాస్కెట్‌బాల్...

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం రెండు గంటలకు జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవీంద్ర పేర్కొన్నారు. ఆసక్తిగల బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు. జనవరి ఒకటి, 2011వ సంవత్సరంలో పుట్టినవారు అర్హులని తెలిపారు. వివరాలకు 98661 26955 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, అవసరమైతే ప్రాణాలైనా అర్పిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా మూడో రోజు గురువారం సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్మాణంలో ఎటువంటి పాత్ర లేని భాజపాకు దానిని విక్రయించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేవలం తన అనుకూల కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఉవ్విళ్లూరుతుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం తన ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ.. రూ.3.50 లక్షల కోట్ల విలువైన ఉక్కు పరిశ్రమను కేవలం రూ.1300 కోట్లకు అప్పగించేందుకు ప్రయత్నించడం దేశ ద్రోహ చర్య అని మండిపడ్డారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పమిడి వెంకటరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, చుంచు శేషయ్య, చావలి సుధాకరరావు, భీమవరపు సుబ్బారావు, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో మాట్లాడుతున్న రంగారావు, పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

పడి లేచిన వృక్షరాజం


ఎన్ఏపీ పంప్‌హౌస్ వద్ద నేలవాలిన సీమచింత చెట్టు


కాండపై భారీగా పెరిగిన కొమ్మలు

చిన్నపాటి సమస్యలకే ఎంతో మంది కుంగుబాటుకు గురవుతుంటారు. జీవితంలో మళ్లీ ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా.. ఏమాత్రం అన్వేషించరు. 'కెరటం నాకు ఆదర్శం. పడినందుకు కాదు, మళ్లీ లేచినందుకు' అని.. వివేకానందుడు చెప్పిన ఈ మాటలో ఎంతో సంకల్ప బలం ఉంది. ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వాటిని తట్టుకుంటే మళ్లీ మంచి రోజులు వస్తాయి. ఇందుకు నిదర్శనమే ఈ వృక్షం. దర్శి ఎన్ఏపీ తాగునీటి పథకం పంప్‌హౌస్ వద్ద ఉన్న సీమ చింత చెట్టు నాలుగేళ్ల క్రితం గాలులకు నేలకొరిగింది. దీంతో ఇక ఎండిపోతుందని అక్కడివారంతా అనుకున్నారు. కానీ భూమిలో ఉన్న వేరు వ్యవస్థ దెబ్బతినకుండా కొంత భాగం మిగిలి ఉండడంతో కొద్ది రోజులకే మళ్లీ చిగురించింది. నేలవాలిన కాండంపై నుంచే కొమ్మలు పెరిగి పెద్ద చెట్లను తలపిస్తున్నాయి. అందుకే ఈ వృక్షం కెరటంతో సమానం. –న్యూస్‌టుడే, దర్శి

6న నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6న ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో పేద నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కార ప్రదానం చేయనున్నట్లు జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.మధుబాబు తెలిపారు. సదరు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం స్థానిక జిల్లా సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాదెండ్ల రాఘవ, ఎం.వెంకటరావు, ఏ.శ్రీమన్నారాయణ, ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట అటెండర్ మోసం

ఒంగోలు నేరవిభాగం: ఉద్యోగం పేరిట డబ్బులు వసూలు చేసి మోసగించిన ఒంగోలు తహసీల్దారు కార్యాలయ అటెండర్‌పై ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు భాగ్యనగర్‌కు చెందిన చిడితోటి లక్ష్మీప్రియకు స్థానిక గద్దలగుంటకు చెందిన కసుకుర్తి సందీప్ తమ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం, కుదరకపోతే ఇంటి స్థలం ఇప్పిస్తానంటూ రెండేళ్ల క్రితం రూ.లక్ష తీసుకున్నారు. వీటిలో దేనినీ అతను నెరవేర్చకుండా ఆమెను మోసగించారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వై.నాగరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత ఇసుక సరఫరా చేయాలని ఆందోళన


మార్కాపురం గడియారస్తంభం కూడలి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

మార్కాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఇసుకను సరఫరా చేయలేకపోతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దగ్గుపాటి సోమయ్య పేర్కొన్నారు. గురువారం మార్కాపురంలోని గడియారస్తంభం కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఉచిత ఇసుకను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ మార్కాపురంలో పిడికెడు ఇసుక లభించడం లేదన్నారు. రూ.1100 ఉన్న ఇసుక టన్నును నేడు టన్ను ధర రూ.2 వేల వరకు విక్రయాలు చేస్తున్నారని, మార్కాపురం నియోజకవర్గంలోకి ఇసుక రాకపోవడంతో వందల సంఖ్యలో భవన నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మార్కాపురం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని బొందలపాడులో గురువారం చోటుచేసుకుంది. మార్కాపురం గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారం రెడ్డి వెంకట సుబ్బారెడ్డి (53) తమ పత్తి పొలం లోపలికి వెళ్తున్న క్రమంలో సోలార్ తీగలకు విద్యుత్తు సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. తమ పొలం ఎనిమిది ఎకరాల చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేశారు. దానికి సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్తు తీగ తెగి సోలార్ తీగపై పడిన విషయం ఆయన గమనించలేదు. విషయం తెలుసుకున్న సమీప పొలాల్లో రైతులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. మార్కాపురం గ్రామీణ ఎస్సై అంకమరావుతో పాటు సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా.. అప్పటి వరకు తోటి రైతులతో సరదాగా మాట్లాడిన వెంకట సుబ్బారెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఆయనకు భార్య లక్ష్మమ్మ, కుమారుడు వెంకటరెడ్డి ఉన్నారు.


ఘటనా స్థలంలో వెంకటసుబ్బారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమరావు

గిద్దలూరు ప్రజలకు సాగునీరు అందించండి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని రైతులు వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతికి వినతిపత్రం అందించారు. గురువారం గిద్దలూరు మండలం కొత్తకోట గ్రామంలో వెలిగొండ ప్రాజెక్టు కాలువ కోసం భూములు కోల్పోతున్న రైతులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కడప జిల్లాకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మండలంలోని గ్రామాల మీదుగా కాలువలు వెలుతుండగా సమీప గ్రామంలోని రైతుల పొలాలకు నీరు అందించకుండా అక్కడికి తీసుకెళ్లడం ఏమిటని అధికారులను రైతులు ప్రశ్నించారు. వెలిగొండ ప్రధాన కాలువల ద్వారా మండలంలోని ప్రతి చెరువులకు నీటిని నింపాలని కోరారు. తమ ప్రాంతాలకు నీరు అందించకుండా కడప జిల్లాకు తీసుకెళ్తే తమ పొలాల మీదుగా కాలువల ఏర్పాటుకు అనుమతించమని రైతులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతికి తెలియజేశారు.

ఆక్రమణల తొలగించేందుకు చర్యలు



ఆక్రమణలను పరిశీలిస్తున్న మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. గురువారం బేస్తవారపేటలోని 544-డి జాతీయ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను, వ్యాపార సముదాయాలను తహసీల్దార్ జితేంద్ర కుమార్, ఎస్సై రవీంద్రారెడ్డి, హైవే, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారికి వెడల్పు 30 మీటర్ల మేర ఉండాలని అందులో మెయిన్‌రోడ్డు సర్వీస్ రోడ్డు ఉంటాయని రహదారి సెంటర్ పాయింట్ నుంచి ఇరువైపులా 15 మీటర్ల మేర అవసరమైన స్థలాన్ని గుర్తించి కొలతలు వేసి అందులో అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. సర్వీస్ రోడ్ల వెంబడి పండ్లు, కూరగాయల దుకాణాలు, పలు వ్యాపార సముదాయాలను తొలగించారు. ఆక్రమణలను తొలగించేందుకు ఇప్పటికే సర్వే పూర్తి అయిందని ఇంటి నిర్మాణాలు తొలగించాల్సి వస్తే వారికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 70 శాతం ఇంటి యజమానులకు నష్టపరిహారాన్ని జమ చేసినట్లు తెలిపారు.

తూకంలో మోసం.. కేసు నమోదు

కంభం (రాచర్ల) : రాచర్ల మండలం చోళవీడు గ్రామంలో పత్తి తూకంలో వ్యాపారి మోసం చేస్తున్నాడని రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. కొమరోలు మండలానికి పత్తి వ్యాపారి వెంకటయ్య, కొంతమందితో కలిసి పత్తి కొనుగోలు కోసం వచ్చారు. తూకంలో మోసం చేయడంతో కర్షకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూదరులు అరెస్టు : మార్కాపురం : మార్కాపురం పట్టణ శివారులోని ఇందిరమ్మకాలనీలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మార్కాపురం పట్టణ పోలీసులు దాడి చేసి ఆరు మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.1650 స్వాధీనం చేసుకున్నారు.

ఆక్రమణలను తొలగించాలి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పట్టణంలోని నగర పంచాయతీ అధికారులు ప్రధాన రహదారి పక్కన ఆక్రమణలను తొలగిస్తున్నారని, పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోని ఆక్రమణలు తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి కె.వెంకట రత్నం కోరారు. పొదిలిలోని పెద్దచెరువు, చిన్నచెరువు భూములు, అలుగు కాలువలపై నిర్మాణాలు చేసిన వాటిని తొలగించాలన్నారు. అలాంటి స్థలాలను అమ్మి సొమ్ము చేసుకున్నవారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, నగర పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు.

వీడిన సందిగ్ధత



మంత్రి కొల్లు రవీంద్రతో సమావేశమైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి, తదితరులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : మార్కాపురం నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గురువారం రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రను మంగళగిరి లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలసి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ఇసుక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని, ఎస్టేట్ లోని పలకల పరిశ్రమకు పూర్వ వైభవం తెచ్చేందుకు పలకల క్వారీల్లో తీసే ముడి రాయికి గ్రానైట్‌తో పోల్చకుండా రాయల్టీ ఫీజు తగ్గించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. దీంతో టన్నెజ్‌తో సంబంధం లేకుండా ఇసుక తీసుకెళ్లేలా మంత్రి ఆదేశాలు ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

తపాలా సిబ్బంది నిరసన

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: అసంబద్ధమైన, ఆచరణ సాధ్యం కాని టార్గెట్ వ్యతిరేకంగా ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, జాతీయ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ల పిలుపు మేరకు స్థానిక పోస్టాఫీసు వద్ద ఆ శాఖ సిబ్బంది గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని నెహ్రూబజార్ శ్రీషిర్డి సాయిబాబా మందిరం తరపున విజయవాడ వరద బాధితులకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి గురువారం కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు పి.సత్యనారాయణ, కార్యదర్శి జి.హరిహరరావు, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం కట్టి.. షట్టర్ల ఏర్పాటు మరచి

• ఆరేళ్లుగా వృథా అవుతున్న నీరు • కోట్లు ఖర్చు చేసి ప్రయోజనమేదీ? • కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

మార్కాపురం, న్యూస్‌టుడే :

వైకాపా నిర్లక్ష్యం కారణంగా మార్కాపురం ప్రజలు నీటి కోసం విలవిలలాడాల్సిన దుస్థితి ఏర్పడింది. అయిదేళ్ల అధికారంలో ఉండీ కేవలం రూ.57లక్షలు మంజూరు చేసి ఉంటే అప్పటి తెదేపా హయంలో రూ.9 కోట్లతో చేపట్టిన ఆ చెక్‌డ్యాం ఉపయోగపడేది. ఒక రూపాయి మంజూరు చేయకపోవడంతో వర్షాలు పడినా నీరు నిల్వ లేక వృథాగా పోతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారించి నీటి వృథాను అరికట్టాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతి ఏడాది కరవు కారణంగా మార్కాపురం మండల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ట్యాంకర్లతో సరఫరా చేస్తూ కొంత మేరకు సమస్యను తాత్కాలికంగా పరిష్కరిస్తూ వస్తోంది. భూగర్భజలాల పెంపు లక్ష్యంగా పెద్ద నాగులవరం సమీపంలో గుండ్లకమ్మ నదిపై 2017-18లో రూ.9 కోట్లతో చెక్ డ్యాంను నిర్మాణం చేపట్టింది. 90శాతం పనులు పూర్తి చేసిన గుత్తేదారు షట్టర్లు (తూములు) ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో వర్షాలు పడినా నీరు నిల్వ లేకుండా వృథా అవుతూనే ఉన్నాయి. తూములు ఏర్పాటు చేయడానికి మిగిలిన 10 శాతం పనులు చేపట్టడానికి ప్రభుత్వానికి రూ.57 లక్షలతో ప్రతిపాదనలు పంపించింది. నిధులు మంజూరు కాకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ లోపు తెదేపా ప్రభుత్వం మారి వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయిదేళ్లు ఒక రూపాయి కూడా మంజూరు చేయకపోవడంతో ఆ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయింది.



వృథాగా దిగువకు పోతున్న నీరు

నాలుగు గ్రామాలకు ప్రయోజనం

ఈ చెక్ డ్యాం పూర్తి చేసి ఉంటే నీటి నిల్వతో మార్కాపురం మున్సిపాల్టీ నీటి సమస్యకు ఇబ్బంది ఉండేది కాదు. లక్ష మంది జనాభా కలిగి ఉన్న నగర నీటి సమస్య తీరేది. డీప్ బోర్లకు భూగర్భజలాల నీటి మట్టం పెరిగి పెద్దనాగులవరం, దరిమడుగు, బోడపాడు, రాజుపాలెం గ్రామాల్లో రైతులకు ఇబ్బంది తప్పేది. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వెయ్యి ఎకరాల భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. శిథిలావస్థకు చేరిన ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే మరో 1500 ఎకరాల సాగులోకి వచ్చేది. 2500 మంది రైతులకు ప్రయోజనం చేకూరేది. కేవలం పదిశాతం పనులు చేపట్టకపోవడం వల్లే నీటికి కటకటలాడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ పెద్దనాగులవరం గ్రామస్థులు పలు మార్లు ఉప కలెక్టర్, తహసీల్దారు, జలవనరులశాఖ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు.



రూ.9 కోట్లతో నిర్మాణం చేసిన చెక్ డ్యాం

ప్రభుత్వానికి నివేదికలు పంపించాం

గత ప్రభుత్వ హయం లోనే నిధుల కోసం నివేదికలు పంపాం. మంజూరు కాకపోవడంతో చెక్‌డ్యాం లోని నీరు వృథాగా పోతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరైన వెంటనే తూము పనులు ప్రారంభిస్తాం.
– బి.పోలురాజు, డీఈ, జలవనరులశాఖ, మార్కాపురం

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక రంగం అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన జిల్లా తెదేపా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీని బేస్తవారపేటకు చెందిన తెదేపా బీసీ గాంధీ, తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు బొయిళ్ల రోషన్‌బాబు గురువారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



బాలాజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న బొయిళ్ల రోషన్‌బాబు

నూరు మందికి కంటి పరీక్షలు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఏపీయుడబ్ల్యూజే సహకారంతో శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నూరు మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 60మందికి కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు.



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మాజీ ఎమ్మెల్యే కె.పి.కొండారెడ్డికి మాతృవియోగం



చెంచమ్మ

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కె.పి. కొండారెడ్డి మాతృమూర్తి, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి నానమ్మ కుందురు చెంచమ్మ (98) వయో భారంతో గురువారం మృతిచెందారు. మార్కాపురం మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన చెంచమ్మ మృతికి పలువురు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, , మార్కాపురం వైకాపా సమన్వయకర్త అన్నా రాంబాబులు కొండేపల్లి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008574141
పొదిలి : 8008550360



కంభం, న్యూస్‌టుడే

సమస్య : మండలంలోని హజరత్‌గూడెం పంచాయతీలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. కానీ ఆరు నెలలైనా వాటికి నీరు రావడం లేదు. అధికారులు స్పందించి కుళాయిలకు జలం వచ్చేలా చర్యలు తీసుకోవాలి. – వెంకటేశ్వర్లు, స్థానికుడు

సమాధానం : చిన్నపాటి మరమ్మతులు చేయించాల్సి ఉంది. వాటిని పూర్తి చేసి కుళాయిలకు నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – రవీంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, డీఈ, కంభం

గుడి గంటల చోరీ

కంభం, న్యూస్‌టుడే : కందులాపురం గ్రామ సమీపంలోని కొండపై ఉన్న అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి రెండు గంటలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఆలయ ధర్మకర్త పాపిరెడ్డి తెలిపారు. ధర్మకర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.

కంకర పరిచి వదిలేశారు...!



పాత మల్లాపురం నుంచి జే.సి అగ్రహారానికి వెళ్లే రహదారి దుస్థితి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో రహదారుల నిర్మాణం, నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో గ్రామాల్లోని రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు నిత్యం నరకం చూస్తున్నారు. మండలంలోని పాత మల్లాపురం నుంచి జే.సి అగ్రహారానికి, జే.సి అగ్రహారం నుంచి గంటాపురానికి వెళ్లే పంచాయతీరాజ్ లింక్ రోడ్ల నిర్మాణానికి కంకర పరిచి తారు వేయకుండా వదిలేశారు. పలువురు వాహనచోదకులు జారిపడి గాయాలపాలయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులను బాగుచేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ (రాచర్ల) మద్దుల సుబ్బారెడ్డిని వివరణ కోరగా బీటీ రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని 15 రోజుల్లో పనులు చేపడతామని తెలిపారు.

ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు



మార్కాపురం పట్టణం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



త్రిపురాంతకం గ్రామీణం : అమ్మవారు సమర్పించే పట్టు వస్త్రాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు



కంభం : ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి

త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీ దేవి, త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెదేపా వైపాలెం నియోజకవర్గ ఇంఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ఉత్సవంలో పాల్గొన్నారు. ▶ పొదిలి శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారు వాసవీ కన్యకాపరమేశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. * మార్కాపురం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.▶ బేస్తవారపేటలోని పలు ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ▶ కంభంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ▶ పెద్దదోర్నాల వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారిని వాసవీ మాతగా అలంకరించారు ▶ కొమరోలులోని అమ్మవారు మొదటి రోజు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.▶ మార్కాపురం మండలంలోని ముద్దసానమ్మ అమ్మవారి దేవాలయంలో, వేములకోట శ్రీ గంగా భవానీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంల దేవీనవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి.▶ గిద్దలూరు నగర పంచాయతీ ముండ్లపాడు గ్రామంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు.
– న్యూస్‌టుడే బృందం



పెద్దదోర్నాలలో కన్యకాపరమేశ్వరీదేవిగా..



బేస్తవారపేటలో చౌడేశ్వరీ దేవీగా...



కొమరోలులో వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీ అలంకరణలో..



కంభం : ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

సస్య రక్షణతో అధిక దిగుబడి



మిరప పంటను పరిశీలించి రైతులో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారిణి శ్వేత

కంభం, కంభం (రాచర్ల), గిద్దలూరు పట్టణం, పెద్దదోర్నాల, బేస్తవారపేట, మార్కాపురం : మిరప పంటలో సస్య రక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారిణి శ్వేత పేర్కొన్నారు. కంభం మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మిరప పంటను పరిశీలించారు. ▶ రాచర్ల మండలంలోని రాచర్ల, అనంపల్లి గ్రామాల్లో పత్తి పంటను వ్యవసాయాధికారి అబ్దుల్ రఫీక్ పరిశీలించారు. మెగ్నీషియం లోపం నివారణను తీసుకోవాల్సిన చర్యలను రైతులు తెలియజేశారు.▶ గిద్దలూరు మండలం గడికోట, చట్రెడ్డిపల్లె గ్రామంలో మొక్కజొన్న సాగును గిద్దలూరు మండలం వ్యవసాయశాఖ అధికారి యేరువ విజయభాస్కర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి విష్ణుప్రియ పరిశీలించారు. ▶ పెద్దదోర్నాల మండలం చింతల, బోడేనాయక్ తండా గ్రామాల్లో వ్యవసాయాధికారి జవహర్ లాల్‌నాయక్ పత్తి, మిరప పంట పొలాలను పరిశీలించారు.▶ బేస్తవారపేట మండలంలోని సలకలవీడులో ఏవో జక్కం మెర్సీ వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.▶ పొదిలి మండలం మూగచింతల, కొండాయపాలెం గ్రామాల్లో వ్యవసాయాధికారి జైనుల్లాబ్దీన్ కంది, సజ్జ పంటలను పరిశీలించారు.▶ మార్కాపురం మండలంలోని కంది రైతులు తక్షణమే పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని గోగులదిన్నె, రాయవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.



పొదిలి ఎంపీడీవో జి.శోభన్‌బాబును సన్మానిస్తున్న తెదేపా నాయకులు



వైపాలెం ఎంపీడీవోగా శ్రీనివాసులు

బాధ్యతల స్వీకరణ



కొనకనమిట్ల ఎంపీడీవో ఈశ్వరమ్మ



త్రిపురాంతకం ఎంపీడీవో రాజ్‌కుమార్

పొదిలి, పొదిలి గ్రామీణం, యర్రగొండపాలెం, కొనకనమిట్ల, అర్ధవీడు, కొమరోలు, త్రిపురాంతకం, న్యూస్‌టుడే: పొదిలి ఎంపీడీవోగా జి.శోభన్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దర్శిలో పనిచేస్తూ బదిలీపై పొదిలి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన శోభన్‌బాబును కార్యాలయ సిబ్బంది అభినందించారు. తెదేపా నాయకులు ఉలవా గోపి, యల్లమంద, ఓబులరెడ్డి, ఖుద్దూస్, వెంకట్రావులు కలిసి దుశ్శాలువా కప్పి అభినందించారు. ▶ యర్రగొండపాలెం ఎంపీడీవోగా బి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. తూ.గో జిల్లా గంగవరం మండల ఎంపీడీవోగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ▶ కొనకనమిట్ల ఎంపీడీవో ఈశ్వరమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నెల్లూరు జిల్లా ఉదయగిరి నుంచి ఇక్కడ బదిలీపై వచ్చారు. ▶ అర్ధవీడు నూతన ఎంపీడీవోగా డి.నరసయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ▶ కొమరోలు మండల నూతన పంచాయతీ రాజ్ ఏఈగా జి.ఈరయ్య బాధ్యతలు చేపట్టారు. ఈయన కంభం పీఐయూ సబ్ డివిజన్ నుంచి బదిలీపై వచ్చారు.▶ త్రిపురాంతకం ఎంపీడీవోగా రాజ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అయితే 2018 నుంచి మండలానికి రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడంతో మండలంలోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

కంభం : ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ మేనేజర్ విజయకుమారి పేర్కొన్నారు. మండలంలోని కందులాపురం సచివాలయంలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సురక్షితం కానీ లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, సిరంజిలు తదితర వాటి ద్వారా వ్యాపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి తిరుపాలమ్మ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయకుమారి

పవన్ దీక్షకు మద్దతుగా పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా యర్రగొండపాలెంలో జనసేన నాయకులు పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం పూజలు చేశారు. భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఆకుల రమేష్, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, బాలకృష్ణ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

కనిగిరి, న్యూస్‌టుడే:

సమస్య: కనిగిరి మున్సిపాలిటీలోని శంకవరంలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. వెంటనే అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలి. - షేక్ గౌస్, శంకవరం

సమాధానం: మున్సిపల్ సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. - కోటేశ్వరరావు, మున్సిపల్ ఏఈ

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని హాజీపురం తాగునీటి ట్యాంకుకు సాగర్ జలాలు విడుదల చేయకపోవడంతో ఎగువ గ్రామాలకు నీరు రావడం లేదు. దీంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలి. - డి. సుధాకర్, హాజీపురం గ్రామస్థులు

సమాధానం: తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. - శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పొగాకు గరిష్ఠ ధర రూ.358

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం 851 బేళ్ల కొనుగోలు జరిగాయి. మండలంలోని పొందూరు గ్రామానికి చెందిన రైతులు 978 బేళ్లను తీసుకురాగా.. అందులో 851 బేళ్లను వివిధ కంపెనీలు కొనుగోలు చేశారు. 121 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.140లు పలికిందని వేలం కేంద్ర నిర్వాహకులు అబ్బూరి శ్రీనివాసరావు తెలిపారు.

884 బేళ్ల కొనుగోలు: కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో గురువారం 884 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వాహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. జోర్లు పరిధిలోని చతుకపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రపడియా, నెన్నూరుపాడు, నేతివారిపాలెం, రామచంద్రాపురం, కట్టవారిపాలెం, నరసింగోలు గ్రామాలకు చెందిన రైతులు వేలం కేంద్రానికి 1,234 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా.. మిగిలిన 350 బేళ్లను వివిధ కారణాల చేత తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.130, సరాసరి ధర రూ.216.03 పలికిందన్నారు.

రాక.. పోక.. ఎవరికి ఎరుక!

● సమయపాలన లేని సచివాలయ సిబ్బంది

● గత సెప్టెంబర్ 13న టంగుటూరు పురం సెంటర్‌లోని సచివాలయం 2 పరిధిలో ఉదయం 11.07 గంటలకు కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. ఇతర శాఖల సిబ్బంది రాక కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. సిబ్బంది ఎక్కడని తోటి సిబ్బందిని అడిగితే క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారని, సెలవులో ఉన్నారని చెప్పుకొని రావడం గమనార్హం.

● గత సెప్టెంబర్ 19న జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామ సచివాలయంలో ఉదయం 11.05 గంటలకు కేవలం 4 సిబ్బంది మాత్రమే వచ్చారు. కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి.

టంగుటూరు, న్యూస్‌టుడే:

ప్రజలకు స్వపరిపాలన అందించాలని గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకొచ్చింది. ప్రజలకు సేవలందించాల్సిన సిబ్బంది సమయపాలన ఏ మాత్రం పాటించడం లేదు. ఉదయం 11 గంటలైనా కార్యాలయాలకు రాని పరిస్థితి. హాజరు పట్టికను సక్రమంగా నిర్వహించాలంటూ చేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశించినా పలు సచివాలయాల్లో నేటికీ అది అమలు కావడం లేదు. దీంతో సేవలు పొందేందుకు వచ్చిన ప్రజలు నిరాశగా వెనుదిరుగుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ తప్పించి ఇతర సిబ్బంది ఒక్కరూ సమయపాలన పాటించడం లేదు. ఎవరైనా ప్రశ్నిస్తే మండల కార్యాలయాల వద్ద సమావేశాలకు వెళ్లారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారంటూ తోటి సిబ్బంది చెప్పుకొస్తున్నారు. నియోజకవర్గానికి, మండలాలకు దూర గ్రామాల్లో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కేవలం హాజరు వేసుకుని సిబ్బంది ఇళ్లకు వెళ్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లిపోతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.



జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామ సచివాలయంలో ఉదయం 11.00 గంటలకు విధులకు హాజరైన సిబ్బంది

ఉన్నతాధికారులంటే గౌరవమెక్కడా...

ఆకస్మిక తనిఖీలు, క్షేత్రస్థాయి పర్యటనలకు వచ్చిన సమయంలో సచివాలయ సిబ్బంది కోసం అధికారులు వేచి ఉండాల్సిన వస్తోందని మండల స్థాయి అధికారులే చెప్పుకొస్తుండడం గమనార్హం. పై అధికారులు వస్తున్నారనే భయం లేదని.. ఏకంగా ఎంపీడీవోల మాటలే పెడచెవిన పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రిజిస్టర్ మెయింటినెన్స్ చేయాలని, ఉదయం 10.30, మధ్యాహ్నం 3, సాయంత్రం 5 గంటల తర్వాత వేలిముద్రలు వేయాలంటూ అధికారులు సూచించినా ఎక్కడా అమలు కావడం లేదు. ఈ విషయమై డీపీవో ఉషారాణి దృష్టికి తీసుకువెళ్లడంతో మండల స్థాయి అధికారులతో చర్చించి అనంతరం పరిశీలించి చర్యలు తీసుకుంటామని న్యూస్‌టుడేకు తెలిపారు.

నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ సచివాలయాలు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

మండలం	సచివాలయాలు	సిబ్బంది (సుమారు..)
కొండపి	14	120
మర్రిపూడి	13	104
పొన్నలూరు	15	133
జరుగుమల్లి	15	128
సింగరాయకొండ	15	142
టంగుటూరు	18	174

అమ్మా భవానీ.. లోకాలనేలే తల్లీ..

న్యూస్‌టుడే బృందం: కనిగిరి, దర్శి, కొండపి నియోజకవర్గాల్లో వివిధ ఆలయాల్లో గురువారం నుంచి దసరా శరన్నవరాత్రులు నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కనిగిరి పట్టణంలోని శ్రీ అంకాళేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శ్రీవారికి పల్లకి సేవ నిర్వహించారు. భైరవకోనలో స్వామి వారికి రుద్రాభిషేకం, త్రిముఖ దుర్గాదేవికి కుంకుమార్చన, అగ్ని ప్రతిష్ఠ, చండీ హోమము వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. సి.ఎస్.పురంలో మహిళలు కలశాలతో ప్రదర్శనగా కామాక్షి చంద్రమౌళీశ్వరస్వామి ఆలయానికి చేరుకుని అఖండ అమ్మవారికి అభిషేకాలు చేశారు.



పామూరు: ప్రత్యేకాలంకరణలో



దర్శి: బాలత్రిపురసుందరిదేవిగా పోలేరమ్మతల్లి



కనిగిరి: అలంకారంలో వెంకటేశ్వర స్వామి



తాళ్లూరు: వాసవీ అమ్మవారు



సి.ఎస్.పురంలో కలశాలతో ప్రదర్శనగా వస్తున్న మహిళలు

కొండపిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

మర్రిపూడి: కొండపిని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ పేర్కొన్నారు. పుడుగ గిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్య మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని వమ్ము చేయనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 880 కిలోమీటర్ల తీరప్రాంతం ఉందని, పోర్టులు, హార్బర్ల అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. పాకల బీచ్, పుడుగలిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరసారెడ్డి, శ్రీనువాసులు, హనుమారెడ్డి పాల్గొన్నారు.

దామచర్ల సత్యకు సత్కారం

టంగుటూరు: ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యను తెదేపా నాయకులు సత్కరించారు. మండలంలోని తూర్పు నాయుడుపాలెంకు చెందిన నేతలు దామచర్ల బుజ్జి, దామచర్ల అనిల్, గడ్డం శివ, కొమ్మినేని శ్రీనివాసరావులు గురువారం ఒంగోలులోని సత్య నివాసంలో అయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి గజమాలతో సత్కరించారు.



దామచర్ల సత్యను గజమాలతో సత్కరిస్తున్న తెదేపా నేతలు

పొలం పిలుస్తోందితో రైతులకు ప్రయోజనం

తాళ్లూరు, సీఎస్‌పురం, టంగుటూరు, న్యూస్‌టుడే: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని దర్శి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కె. బాలాజీనాయక్ స్పష్టం చేశారు. మండలంలోని దారంవారిపాలెం, మన్నేపల్లి, తూరకపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా పలు పంటలను పరిశీలించి.. అధిక దిగుబడులు సాధించే పద్ధతులు రైతులకు వివరించారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలు అవగాహన కల్పించారు. అనంతరం పొలం పిలుస్తుంది కార్యక్రమాలకు సంబంధించిన గోడప్రతులను వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ బి.ప్రసాదరావు, మండల ప్రకృతి సాగు ఇన్‌ఛార్జి పి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ● సీఎస్ పురం మండలంలోని అరివేముల, గుంతచెన్నంపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పొద్దుతిరుగుడు విత్తనాల మినీ కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ● టంగుటూరు మండలం అనంతవరం, వెలగపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ, ఇతర అనుబంధ శాఖల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.



తాళ్లూరు మండలం దారంవారిపాలెంలో గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఏడీఏ నాయక్, ఇతరులు

పొంచి ఉన్న ప్రమాదం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి- సీఎస్‌పురం రోడ్డులో మండలంలోని చాకిరాల సమీపంలో వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై భాగంలో ఇనుప చువ్వలు బయటకు వచ్చి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ఇదే మార్గంలో వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాలతో పాటు, కడప, బెంగళూరు వైపు బస్సులు, ఇతర వాహనాలు వందలాదిగా వెళ్తుంటాయి. రాత్రి వేళ అయితే ఈ గుంతలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు గుంతల్లో పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. సత్వరమే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి దెబ్బతిన్న చోట మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ. శాఖ ఏఈ ఫిరోజ్‌ను వివరణ కోరగా మరమ్మతులు త్వరలో చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు.



గుంతలేర్పడి ప్రమాదకరంగా ఉన్న వంతెన



చువ్వలు బయటకొచ్చిన దృశ్యం

సంక్షిప్త సమాచారం

యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు

తాళ్లూరు: బత్తాయి, నిమ్మ తోటల సాగులో రైతులు విధిగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యాన పరిశోధనా క్షేత్రం ప్రధాన శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబు స్పష్టం చేశారు. మండలంలోని నాగంబొట్లపాలెంలో గురువారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల రైతులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు.

ఆటో చోదకులకు కౌన్సిలింగ్

టంగుటూరు, న్యూస్‌టుడే: ఆటో చోదకులు ఇష్టారీతిన వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. టంగుటూరు బొమ్మల కూడలిలో గురువారం సాయంత్రం ఆటోచోదకులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. చోదకులు ప్రతీ ఒక్కరూ విధిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ కల్గి ఉండాలని స్పష్టం చేశారు.

పంట నమోదు తప్పనిసరి

కనిగిరి: ప్రతి రైతు తప్పనిసరిగా పంటను నమోదు చేయించుకోవాలని కనిగిరి వ్యవసాయాధికారిణి పి. జ్యోత్స్న సూచించారు. మండలంలోని చీర్లదెన్ని, బల్లిపల్లి గ్రామాల్లో గురువారం పంటలను పరిశీలించారు.

దుస్తుల పంపిణీ

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలోని చిల్డ్రన్స్ వార్డులకు కనిగిరి భాజపా నాయకులు గురువారం రూ. 10వేలు విలువ చేసే బెడ్ షీట్లు పంపణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. . ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి సీహెచ్‌సీని కార్పొరేట్ వైద్యశాలకు మించి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని.. ఆయన స్ఫూర్తితో తమ వంతుగా సాయం అందించామన్నారు.

బ్యాంకింగ్ రంగంలో మంచి భవిష్యత్తు

తాళ్లూరు: ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంకింగ్ సేవలపై అవగాహన పూర్తిస్థాయిలో ఏర్పరుచుకోవాలని, ఈ రంగంలో విద్యార్థులు రాణించేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని తూర్పుగంగవరంలోని యూనియన్ బ్యాంకు మేనేజరు జాన్ పీటరు తెలిపారు. బ్యాంకులో గురువారం వృత్తివిద్యా కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న పలువురు విద్యార్థినులకు సేవలపై అవగాహన కల్పించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సి.ఎస్.పురంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆర్.సుమన్ హెచ్చరించారు. గ్రామంలోని ప్రధాన రహదారి, బస్టాండ్ కూడలి, డీజీపేట రహదారిలో గురువారం దుకాణదారులు, వాహనదారులకు ఆయన సూచనలు చేశారు. కార్లు, ద్విచక్ర వాహనాలు ఇతర వాహనాలను రహదారుపై అడ్డదిడ్డంగా ఎక్కడపడితే అక్కడ పెట్టరాదని తెలిపారు.

అయిదుగురిపై కేసు నమోదు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని పలు బహిరంగ ప్రదేశాల్లో గురువారం మద్యం తాగుతున్న అయిదుగురిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి. కిషోర్‌బాబు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాలు, రహదారులపై ఎవరూ మద్యం తాగరాదని హెచ్చరించారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

పరిసరాలు ఇలా.. పూజలెలా!

■ దసరా నవరాత్రుల వేళ భక్తుల అగచాట్లు

కనిగిరి, న్యూస్‌టుడే:

కనిగిరి అంటేనే దేవాలయాలకు ప్రసిద్ధి. అందులో దసరా నవరాత్రులంటే.. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల్లో అంగరంగ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ తొమ్మిది రోజు ఆలయాలన్నీ భక్తుల సందడితో కిటకిటలాడతాయి. అయితే దేవస్థానానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకునే భక్తులు సరైన సౌకర్యాలు కొరవడి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



దొరువులోకి వెళ్లే మెట్లు దెబ్బతిన్న దృశ్యం

పగుల్లిచ్చి.. ప్రమాదకరంగా మారి..

కనిగిరి పట్టణంలోని కనక దుర్గమ్మ కోవెల, అంకాళేశ్వరి దేవస్థానం, బ్రహ్మంగారి ఆలయాల్లో దసర నవరాత్రులు సందర్భంగా ఈ నెల 12వ తేదీ వరకు ప్రత్యేక భక్తి కార్యక్రమాలు జరుగుతాయి. ప్రస్తుతం ఆలయాల వద్ద అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. అమ్మవారిని దర్శించుకునే ముందు దొరువులో స్నానం చేసే నీళ్లన్నీ వ్యర్థాలు, పాచితో నిండిపోయాయి. మెట్లు పగుల్లిచ్చి ప్రమాదకరంగా మారాయి. దేవస్థానాలకు వెళ్లే మార్గంలో మందుబాబులు తిరుగుతుండటంతో మహిళకు అమ్మవారిని దర్శించుకునేందుకు భయపడిపోతున్నారు. చుట్టూ పక్కల జేబుదొంగల సంచారం కూడా అధికంగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. బ్రహ్మంగారి దేవస్థానం, ఈశ్వరీమాత ఆలయం చుట్టూ పక్కల వ్యర్థాలు, మురుగు ఉండటంతో దుర్వాసన వ్యాప్తిస్తోంది. దీంతో భక్తులకు అగచాట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి దేవస్థానాల చుట్టూ శుభ్రం చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్‌ను వివరణ కోరగా తప్పక శుభ్రం చేయిస్తానని తెలిపారు.



భక్తులు స్నానాలుచేసే చోట పాచి పట్టి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

స్పందనకు వందనం

మురుగు తొలగింపు

కురిచేడు, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దవరం పంచాయతీలోని బీసీ కాలనీలో నివాసాల నుంచి వచ్చే మురుగంతా ఓ ఇంటి సమీపాన చేరి కుంటలా దర్శనమిస్తుంది. ఈ విషయమై స్థానికులు 'ఈనాడు - మేమున్నాం మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రమేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్మికుల చేత మురుగు తొలగించారు.

వైద్యశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి సామాజిక వైద్యశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. గురువారం అమరావతిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వైద్యశాలలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే ఉగ్ర వివరించారు. మదర్ కేర్ యూనిట్ లెవల్- 1 దాతల సాయంతో అభివృద్ధి చేస్తున్నామని.. దీన్ని ప్రారంభోత్సవ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని కోరారు.



పనుల పురోగతిని మంత్రి సత్యకుమార్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డికి మాతృ వియోగం

మార్కాపురం: మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కె.పి.కొండారెడ్డి మాతృమూర్తి, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి నానమ్మ కుందురు చెంచమ్మ (98) వయో భారంతో గురువారం మృతిచెందారు. మార్కాపురం మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన చెంచమ్మ మృతికి పలువురు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ , మార్కాపురం వైకాపా సమన్వయకర్త అన్నా రాంబాబులు కొండేపల్లి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

సాగు తగ్గి.. ధరలు దిగజారి..

కనిగిరి, న్యూస్‌టుడే:


మిరప రైతుల వెతలు ఎన్నటికీ తీరేలా లేవు. లాభాలు వస్తాయని ఆశించి సాగు చేయడం.. వర్షాభావం, ధరల్లేక, తెగుళ్ల బెడదతో చివరకు నష్టపోవడం ఏటా పరిపాటిగా మారింది. ఈయేడు తొలకరి వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఆ పంటపై తీవ్ర ప్రభావం పడింది. సాగు తగ్గి.. నర్సరీల్లో, షేడ్ నెట్‌లు, ఇతర వ్యవసాయ భూముల్లో పెంచుతున్న మిరప నారు ధర పూర్తిగా పడిపోయింది. దాంతో రైతులు నష్టాల పాలవుతున్నారు.

మొక్క రూ.1 మాత్రమే..

జిల్లాలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాలతో పాటు ఇతర ప్రాంతాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తారు. వర్షాభావం, తొలకరి జల్లులు ఆలస్యంగా కురవడంతో చాలామంది రైతులు మిరప సాగుకు వెనుకడగు వేశారు. ఈ సంవత్సరం కేవలం 40 వేల ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది ఎకరాకు రూ.1లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. మిరప దిగుబడి బాగా కూడా వచ్చింది. రేటు మాత్రం రూ. 15 వేలకు మించి ధర పలకపోవడంతో పెట్టిన పెట్టుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ నర్సరీల్లో, సొంతంగా పొలాల్లో మిరప నారు కొనుగోలు చేయడానికి అన్నదాతలు ముందుకు రాలేదు. గతేడాది మొక్క రూ. 2లు ఉంటే ఈ ఏడాది కేవలం రూ.1 రూపాయి మాత్రమే ధర పలుకుతుందని కనిగిరి, పీసీపల్లి, పామూరు, కొనకనమిట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప నారు బెట్టకు వచ్చిన కొంత తెగుళ్ల ఆశించి.. మరికొంత వర్షాలు లేక ఎండిపోయిందని వాపోతున్నారు. నారుకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలె వర్షాలు పడటంతో అడపా దడపా మిరపనారును రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారన్నారు. పీసీపల్లి, కనిగిరి, కొనకనమిట్ల తదితర ప్రాంతాల్లో కొనుగోలు చేసేవారు లేక నారు ముదిరి పోతుంది. ఈ విషయం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపిచంద్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా.. తొలకరి జల్లులు ఆలస్యం కావడం, సరిగ్గా వర్షాలు పడక పోవడం వల్ల ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా మిర్చి సాగు తగ్గిందన్నారు. అయితే రానున్న అక్టోబర్, నవంబరు నెలల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మరికొంత సాగు పెరిగే అవకాశం లేకపోలేదని చెప్పారు.



కనిగిరి మండలం చిన ఇర్లపాడు నర్సిలో ముదిరి పోతున్న మిరపనారు



తెగుళ్లు సోకి ఎండి పోతున్న మిరపనారు

కొండపి ఏవీహెచ్ తనిఖీ.. దస్త్రాల పరిశీలన

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కె.ఉప్పలపాడు పశు వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా పశుసంవర్థక అధికారిణి బేబీరాణి గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులు గొర్రెలు, మేకలకు సంబంధించిన టీకా కార్యక్రమాల పంపిణీ సంబంధించి ఆమె సిబ్బందికి సూచనలు చేశారు. పశుగ్రాస విత్తనాల కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని వివరించారు. ముందుగా కొండపి ఏవీహెచ్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవీహెచ్ రవికుమార్, కె.ఉప్పలపాడు పశువైద్యుడు బి.పేరయ్య, గ్రామీణ పశువైద్యులు, రైతులు పాల్గొన్నారు.



కొండపి ఏవీహెచ్ లో దస్త్రాలను పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి

అధికారుల బాధ్యతల స్వీకరణ

మర్రిపూడి, సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సీఎస్ పురం ఉప తహసీల్దార్‌గా పి.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు డ్వామా కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన సాధారణ బదిల్లో సి.ఎస్.పురానికి బదిలీ అయ్యారు. కార్యాలయంలో అందుబాటులో ఉండి సక్రమంగా విధులు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.● మర్రిపూడి ఎంపీడీవోగా ఎన్.జగదీష్ గురువారం బాధ్యతలు చేపట్టారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని నెహ్రూబజార్ శ్రీషిర్డి సాయిబాబా మందిరం తరపున విజయవాడ వరద బాధితులకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి గురువారం కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు పి.సత్యనారాయణ, కార్యదర్శి జి.హరిహరరావు, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

సహ చట్టం అమలుతో పారదర్శకత

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టంతో పౌరులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి కె.రాధ సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశపు మందిరంలో గురువారం సహ చట్టంపై అవగాహన సదస్సును అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ చట్టంతో పాలనలో పారదర్శకత పెరిగిందని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, పథకాలు తదతర వాటికి సంబంధించిన ఏ సమాచారాన్ని అయినా దరఖాస్తు చేసి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ ఖాదర్‌బి, ఈవోఆర్డీ కె.సుందరరామయ్య, ఉప తహసీల్దారు పి.వెంకటేశ్వర్లు, ఏపీఎం లక్ష్మీనారాయణ గ్రామైక్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల సరళిపై విద్యార్థులకు అవగాహన

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల సరళిపై కొండపి చాణిక్య జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం తహసీల్దారు మురళి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు అంటే ఏమిటి, దాని వల్ల కలిగే ప్రయోజనాలు వంటి విషయాలు వివరించారు. 14 నుంచి 17 సంవత్సరాల విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, వీఆర్వో సుశీల, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ రాజ్యలక్ష్మీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తున్న తహసీల్దారు మురళి

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు



గద్దలగుంట రాజరాజేశ్వరి ఆలయంలో కుంకుమార్చన



కేశవస్వామిపేట కనకదుర్గమ్మ మందిరంలో...

అమ్మవారి వైభవం... చూసిన కనులదే భాగ్యం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున ఆయా ఆలయాల్లో అమ్మవార్లను బాలా త్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి దుర్గమ్మను కొలువుదీర్చారు. శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కలశస్థాపనతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. చెన్నకేశవ స్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. చిత్తా నక్షత్రం సందర్భంగా చెన్నయ్య మాస కల్యాణోత్సవం చేపట్టారు. సంతపేట, లాయర్‌పేట శిర్డీ సాయి మందిరాలు, అచలానంద ఆశ్రమం, గద్దలగుంట రాజరాజరాజేశ్వరి ఆలయం, బాలాజీరావుపేటలో పోలేరమ్మ ఆలయం, గంటపాలెం దుర్గాదేవి , చీమకుర్తి హరిహరక్షేత్రం, మద్దిపాడు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడులోని దేవస్థానాల్లో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే బృందం



శ్రీగిరి ఆలయంలో కలశస్థాపన పూజలు



చీమకుర్తి హరిహర క్షేత్రంలో శిద్దా దంపతుల పూజలు



పెళ్లూరు: స్వర్ణ కవచాలంకరణలో జ్వాలాముఖి అమ్మవారు



శ్రీబాలా త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు

డిగ్రీ విద్యార్థినుల శ్రమదానం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా దామచర్ల సక్కుబాయమ్మ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శ్రమదానం చేశారు. ప్రిన్సిపల్‌ డి.కల్యాణి ఆధ్వర్యంలో విద్యాలయం ఆవరణ, పరిసరాలను గురువారం శుభ్రం చేశారు. కళాశాలను ప్లాస్టిక్‌ రహిత ప్రాంగణంగా తీర్చిదిద్దుతామని ప్రిన్సిపల్‌ తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

7 నుంచి తపాలా వారోత్సవాలు

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు తపాలాశాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీనియర్‌ సూపరింటెండెంట్‌ మహమ్మద్‌ జాఫర్‌ సాధిక్‌ ఓ ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. విదేశాలకు ఉత్పత్తులు పంపేందుకు డాక్‌ఘర్‌ నిర్యాత్‌ కేంద్ర పేరిట ప్రత్యేక సదుపాయం అందుబాటులోకి తెచ్చామన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తగ్గిన భారం... నెలకు రూ.25 లక్షలు

● చెత్త పన్ను ఎత్తేయడంతో నగర వాసులకు ఊరట

న్యూస్‌టుడే – ఒంగోలు నగరం

గత వైకాపా ప్రభుత్వం అడ్డగోలుగా విధించిన చెత్తపన్నును కూటమి ప్రభుత్వం ఎత్తేసింది. నగరవాసులకు ఊరట కల్పించింది. వాస్తవానికి ఇంటి పన్నులోనే చెత్తపన్ను కలిసి ఉంటుంది. అది కాదని గత పాలకులు అదనంగా భారం మోపారు. దీనివల్ల కొత్తగా ప్రయోజనం చేకూరకపోగా ప్రజలపై మరింత భారం పడింది.

వడ్డనే తప్ప ప్రయోజనం లేదు... : యూజర్‌ ఛార్జీలు విధించినా చెత్త సేకరణ తూతూమంత్రంగానే సాగింది. నగర ప్రధాన రహదారుల్లోనూ ఎక్కడికక్కడ కుప్పలుగా చెత్త దర్శనమిచ్చేది. ఆటోల్లో సేకరించిన వ్యర్థాలను డంపింగ్‌ యార్డుకు తరలించకుండా... స్థానికంగానే తడి, పొడి, హానికారక చెత్తను వేటికవిగా విభజించి కంపోస్టు తయారీ, రీసైక్లింగ్‌ యూనిట్లకు తరలించాల్సి ఉంది. ఆ లక్ష్యం నెరవేరలేదు సరికదా... డంపింగ్‌యార్డులో వేల టన్నుల చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. సదరు ఏజెన్సీ వాళ్లే డ్రైవర్‌ వేతనం, ఆయిల్‌, రిపేర్ల బాధ్యత వంటివి చూడాలి. మరమ్మతుల పేరిట రోజుల తరబడి వాహనాలను తిరగని సందర్భాలు ఉన్నాయి. ఆయా సమయాల్లో సంబంధిత ప్రాంతాల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోయేది. వేతనాలు సరిగా ఇవ్వక డ్రైవర్లు మూడు రోజుల పాట సమ్మెకు దిగారు.

నిధులూ దారి మళ్లించారు... : నగర పాలక సంస్థ వారు ఆటోల కోసం నెలవారీ చెల్లించాల్సి రూ.37 లక్షల మొత్తాన్ని ప్రభుత్వానికి పంపినా... నాటి పాలకులు మాత్రం ఏజెన్సీకి చెల్లించకుండా ఇతర అవసరాలకు ఆ నిధులు వినియోగించారు. దీంతో సదరు సంస్థ వారు చెత్త సేకరణ పనులకు తూతూమంతంగా మార్చారు. మరోవైపు... అంతకు ముందున్న చెత్త సేకరణ వాహనాలను పూర్తిగా పక్కన పెట్టేశారు. ఎనిమిది కాంపాక్ట్‌ వాహనాలను మరమ్మతుల పేరిట షెడ్డుకు పరిమితం చేశారు. ప్రస్తుతం ఇవన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రధాన రహదారుల్లో వ్యర్థాల తరలింపునకు... పొదుపు సంఘాలకు చెందిన 16 ట్రాక్టర్లు తిప్పుతున్నారు.



గత వైకాపా ప్రభుత్వంలో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన ఆటోలు

తెదేపా పాలనలో ఇలా...

2014-19 మధ్య తెదేపా హయాంలో... పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పుష్‌కార్ట్‌ల ద్వారా చెత్త సేకరించేవారు. ఇలా పోగైన వ్యర్థాలు తరలించేందుకు పొదుపు సంఘాల మహిళల ద్వారా ఇరవై అద్దె ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో ట్రిప్పునకు రూ.561 చొప్పున చెల్లించేవారు. ప్రధాన రహదారుల్లో చెత్త తరలింపునకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ద్వారా సమకూరిన ఎనిమిది కాంపాక్టు వాహనాలను వినియోగించేవారు. మొత్తంమీద నెలకు సుమారు రూ.15 లక్షల వ్యయంతో మొత్తం చెత్త శుభ్రమయ్యేది.

నగరంలో మొత్తం 68 వేల అసెస్‌మెంట్లు (గృహాలు) ఉన్నాయి. పేదల ఇళ్లకు రూ.50, ఇతరులకు రూ.100 చొప్పున... నెలకు రూ.25 లక్షలు చొప్పున చెత్తపన్ను వసూలు చేస్తున్నారు. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెత్త పన్ను రద్దు చేయడంతో... నగరవాసులపై ఇక ఈ భారం ఉండదు. వాస్తవానికి కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రజలు యూజర్‌ ఛార్జీలు చెల్లించడం ఆపేశారు.

వైకాపా బాదుడు తీరిది...

తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం క్లీన్‌ ఆంధ్రప్రదేశ్‌ (క్లాప్‌) పేరిట కొత్త విధానం అమల్లోకి తెచ్చింది. 2021 అక్టోబర్‌ నుంచి... రాష్ట్రంలోని 40 నగరాలు, పట్టణాల్లో ఇంటింటి చెత్త సేకరణకు ప్రత్యేకంగా ఆటోలు ఏర్పాటు చేసింది. ఈ కాంట్రాక్టును తమ అనుయాయులకు అప్పగించింది. అందులో భాగంగా ఒంగోలుకు 60 ఆటోలు కేటాయించింది. ఒక్కో ఆటోకు నెలకు రూ.63 వేల చొప్పున... మొత్తం అద్దె ఆటోలకు నెలకు రూ.37 లక్షలు నగర పాలక సంస్థ చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. 2026 సెప్టెంబర్‌ వరకు ఇది కొనసాగుతుంది. ఈ భారాన్ని యూజర్‌ ఛార్జీలు (చెత్త పన్ను) పేరిట ప్రజలపైనే మోపింది. ఎన్నికలు సమీపించే వరకు ముక్కుపిండి రూ.6 కోట్లకు పైగా చెత్తపన్ను వసూలు చేసింది. ఇంత చేసినా ఎక్కడి వ్యర్థాలు అక్కడే దర్శనమిచ్చేవి.

భక్తుల మనోభావాలకు ప్రభుత్వం పెద్దపీట

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌ తిరుపతిలో గురువారం నిర్వహించిన వారాహి సభను... నగరంలో ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా పార్టీ నాయకులు ప్రత్యేక తెరలు ఏర్పాటు చేశారు. కంది రవిశంకర్‌ ఆధ్వర్యంలో రవిప్రియమాల్‌, లాయర్‌పేట సాయిబాబా గుడి, సంతపేట నాటుబాబూరావు పార్కు, పార్వతమ్మ గుడి సమీపంలో డిజిటల్‌ స్క్రీన్లు అమర్చారు. భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రవిశంకర్‌ తెలిపారు. తితిదేలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలన్నారు. పార్టీ అధినేత పవన్‌ కల్యాణ్‌ పిలుపుమేరకు జిల్లా అధ్యక్షుడు రియాజ్‌తో కలిసి ఈ ఏర్పాట్లు చేశామన్నారు. పార్టీ కార్యదర్శి కల్యాణ్‌ ముత్యాల, పిల్లి రాజేష్‌, పల్ల ప్రమీల, గోవింద్‌ కోమలి, కల్యాణి, ముంతాజ్‌ తదితరులు పాల్గొన్నారు.



లాయర్‌పేటలో ఏర్పాటుచేసిన తెర వద్ద రవిశంకర్‌, జనసేన నాయకులు

ఎన్‌ఆర్‌ఐ తోడ్పాటు... కారుమంచి కాలువ అభివృద్ధి

చీమకుర్తి, న్యూస్‌టుడే: కె.వి.పాలేనికి చెందిన ప్రవాస భారతీయుడు, నల్‌ సాఫ్ట్‌ అధినేత నల్లూరి వెంకటశేషయ్య సహకారంతో కారుమంచి కాలువ అభివృద్ధి, హెడ్‌ వద్ద తలుపు అమరిక పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలో కనీస నిర్వహణ లేక కాలువలో పూడిక పేరుకుపోయింది. చిల్లచెట్లు పెరిగి దిగువకు నీరు పారని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పూడికతీత పనులకు సహకారం అందించాలని కె.వి.పాలెం, ఏలూరివారిపాలెం, గోనుగుంట, ముప్వారిపాలెం తదితర గ్రామాల రైతులు... స్థానిక నాయకుల ద్వారా వెంకటశేషయ్యకు విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేయడంతో గురువారం నుంచి పొక్లెయిన్‌తో పనులు ప్రారంభించారు. సుమారు అయిదు కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నారు. కాలువ ప్రారంభంలో కొట్టుకుపోయిన తలుపు ఏర్పాటుకు అవసరమయ్యే నిధులు చెల్లిస్తానని చెప్పడంతో... ఆ పనులు కూడా ప్రారంభించారు. సర్పంచి బక్కా శ్రీనివాసరావు, గోరంట్ల ప్రసాద్‌, పుట్టా శ్రీనివాసరావు, పాలడుగు వెంకటనారాయణ తదితరులు పనులను పర్యవేక్షిస్తున్నారు.



పొక్లెయిన్‌తో పూడిక, చిల్లచెట్లు తొలగిస్తున్న దృశ్యం

సారూ... పింఛను ఇప్పించరూ!

చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలు... నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకు చెందిన చెరుకూరి మస్తానమ్మ. వయసు 77 ఏళ్లు. ఒంటరి మహిళ అయిన ఆమెకు గతంలో పింఛను వచ్చేది. వేలిముద్రలు పడడం లేదని 2019 నుంచి ఆపేయడంతో ఆధారం కోల్పోయింది. పింఛను ఇప్పించాలని అప్పటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయింది. మరో చిత్రమేంటంటే ఆధార్‌ కార్డులో ఆమె వయసు అయిదేళ్లుగా నమోదైంది. ఎవరూ లేరని, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని... న్యాయం చేయాలని వేడుకొంటోంది. విషయాన్ని ఎంపీడీవో మహాలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లగా... వివరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు



చంద్రబాబు చేతల ముఖ్యమంత్రి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బీఎన్‌ విజయ్‌కుమార్‌ పేర్కొన్నారు. మద్దిరాలపాడులో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో భాగంగా అంబేడ్కర్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న అత్యాధునిక విద్యుత్తు లైన్‌ పనులను గురువారం ప్రారంభించారు. చంద్రబాబు చేతల ముఖ్యమంత్రి అని కొనియాడారు. మద్దిరాలపాడును ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా హామీలు నేరవేర్చుతున్నట్లు తెలిపారు. రూ.5.10 కోట్ల సిమెంట్‌ రోడ్డు, కాలువల నిర్మాణం జరుగుతోందని... తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.93 లక్షలు కేటాయించారని తెలిపారు. ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు, డీఈ హరిబాబు, ఎంపీడీవో మహాలక్ష్మి, తహసీల్దార్‌ ప్రవీణ్‌కుమార్‌, సర్పంచి అనూరాధ, తెదేపా మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్‌, గుమ్మడి సాయిబాబా, లక్ష్మీవరప్రసాద్‌, ఖాజావలి, సునీల్‌, పున్నారావు, కిషోర్‌, నెప్పల శివకృష్ణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌

గ్రీన్‌బెల్ట్‌ స్థలాల పరిశీలన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు రోడ్డులోని గ్రీన్‌బెల్ట్‌ ప్రాంతాన్ని నగరపాలక సంస్థ కమిషనర్‌ కె.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. కొందరు దుకాణదారులు ఆక్రమించుకున్నట్లు గుర్తించి... తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బందిని ఆదేశించారు. అతిక్రమణలు వెంటనే తొలగించాలన్నారు. 17, 50వ డివిజన్లలో కాలువలు పరిశీలించారు. వాటిలో పెరిగిన పిచ్చిమొక్కలను జేసీబీ సాయంతో తొలగించాలన్నారు. పూడికతీత పనులు పర్యవేక్షించారు. రామనగర్‌ 11వ లైన్‌లో మరమ్మతులకు గురైన కార్లు నిలిపి ఉంచడాన్ని ప్రశ్నించారు. వాటిని తక్షణం తొలగించాలని ఆదేశించారు. కమిషనర్‌తో పాటు కార్పొరేటర్లు, ఆయా డివిజన్ల తేదేపా నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలపై ఆక్రమణల తొలగింపు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కర్నూలు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద కాలువలపై ఉన్న ఆక్రమణలను జేసీబీ సాయంతో గురువారం తొలగించారు. వర్షాల సమయంలో నీరు వెళ్లే దారి లేక సమస్య తలెత్తుతుండడంతో... కమిషనర్‌ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక సిబ్బంది ఈ పనులు చేపట్టారు.

వైకాపా ఓ మునిగిపోయే పడవ: కాంగ్రెస్‌

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జి సత్యేంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అధికార తెదేపా పని తీరు సరిగా లేదని... ప్రతిపక్ష వైకాపా ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. జిల్లా అధ్యక్షులు సైదా మాట్లాడుతూ త్వరలో జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. వైకాపా మునిగిపోయే పడవలాంటిదని... జగన్‌ బంధువు బాలినేని సైతం పార్టీని వీడారని పేర్కొన్నారు. కొందరు నాయకులు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు సుముఖంగా ఉన్నారన్నారు. పార్టీ నాయకులు పాలపర్తి విజేష్‌రాజ్‌, ఉద్దండి మల్లికార్జున్‌ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు సైదా తదితరులు



కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా, జిల్లా అధికారులు

రాణెమ్మ కాలనీలో కలెక్టర్‌ సందర్శన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కొప్పోలు సమీపంలోని నక్కల రాణెమ్మ కాలనీని కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా గురువారం సందర్శించారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్‌ సభ్యుడు జాతోతు హుస్సేన్‌ కాలనీ వాసులతో మాట్లాడారు. పక్కనే ఉన్న నల్లవాగు కారణంగా వర్షాల సమయంలో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కారానికి కాలనీలో మెరక పనులకు చేసేందుకు రూ.40 లక్షలు, రక్షణ గోడ నిర్మాణానికి మరో రూ.1.40 కోట్లు అవసరమని అంచనా వేశారు. అంత మొత్తం వెచ్చించే బదులు ప్రత్యామ్నాయ స్థలం చూడాలని అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు. ఆర్డీవో సుబ్బారెడ్డి, జిల్లా గృహనిర్మాణ, గిరిజన సంక్షేమ అధికారులు పి.ప్రసాద్‌, జగన్నాథరావు, నగరపాలక సంస్థ కమిషనర్‌ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్‌ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఒడా వైస్‌ ఛైర్మన్‌గా జేసీకి బాధ్యతలు

ఒంగోలుగ్రామీణం: ఒంగోలు అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ (ఒడా) వైస్‌ ఛైర్మన్‌గా జేసీ రోణంకి గోపాలకృష్ణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ... రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ ప్రసాద్‌ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో ఉన్న విశ్వేశ్వరరావు ఇటీవల రిలీవ్‌ కావడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

రీసర్వే చిక్కులు లేకుండా రైతులకు పత్రాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల విషయంలో పంచాయతీల తీర్మానాలకు ప్రాధాన్యమిచ్చి సర్పంచులుకు తగిన గౌరవం కల్పించేలా అధికారులు పని చేయాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు కోరారు. గురువారం నిర్వహించిన చీమకుర్తి మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తొర్రగుడిపాడు పరిధిలో వంతెనల నిర్మాణం పూర్తికి రూ.29 లక్షలు కేటాయిస్తూ సమావేశంలో ఆమోదించారు. తమ గ్రామ పరిధిలో అడంగల్‌, ఈసీలు రాని విషయాన్ని పులికొండ ఎంపీటీసీ సభ్యుడు, మండల పరిషత్‌ ఉపాధ్యక్షుడు రావి లక్ష్మయ్య తెలియజేశారు. తహసీల్దారు బ్రహ్మయ్య స్పందిస్తూ రీసర్వే గ్రామాల్లో సమస్య నెలకొందని... రైతు రుణాలకు ఇబ్బంది లేకుండా ధ్రువీకరణపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే ఇళ్లు మంజూరైన వారు వచ్చే మార్చిలోగా పూర్తి చేసుకోవాలని... లేదంటే బిల్లులు వచ్చే అవకాశం ఉండదని గృహ నిర్మాణ శాఖ ఏఈ తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, ఎంపీడీవో రాఘవేంద్ర, పశువైద్యాధికారి పేరయ్య, ఉపాధి హామీ ఏపీవో రాఘవ, ఎంపీటీసీ, కో ఆప్షన్‌ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు. గైర్హాజరైన అధికారులకు షోకాజ్‌ నోటీసులు పంపాలని ఎంపీపీ తెలిపారు. ఇటీవల బదిలీ అయిన పరిపాలనాధికారి సీతారామారావు, సీనియర్‌ సహాయకులు రవికుమార్‌, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, పంచాయితీ రాజ్‌ ఏఈ వీరాంజనేయులు, టైపిస్టు అక్బర్‌ తదితరులను ఘనంగా సత్కరించారు.

విరామం కొనసాగించాలని గ్రానైట్‌ యజమానుల నిర్ణయం

చీమకుర్తి, న్యూస్‌టుడే: సంక్షోభం నుంచి గట్టెక్కేదిశగా చేస్తున్న కార్యక్రమాలను కొనసాగించాలని గ్రానైట్‌ పాలిషింగ్‌ యూనిట్ల యజమానులు తీర్మానించారు. రామతీర్థంలోని వృత్తి శిక్షణ కేంద్రంలో యర్రగుంట్ల శ్రీనివాసరావు అధ్యక్షతన చీమకుర్తి, కంభంపాడు, బూదవాడ, ఏలూరు రోడ్డు ప్రాంతాలకు చెందిన గ్రానైట్‌ పరిశ్రమల యజమానులు గురువారం సమావేశమయ్యారు. అన్ని రకాల స్లాబులకు గిట్టుబాటు ధరలు లభించే వరకు ఆదివారాలు అమలు చేస్తున్న పరిశ్రమల విరామాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. గతంలో మాదిరిగా రాళ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎడ్జికటింగ్‌ పరిశ్రమల యజమానులు విజ్ఞప్తి చేశారు. ఆయా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, ప్రతినిధులు కాట్రగడ్డ రమణయ్య, మలినేని వెంకటేశ్వర్లు, లగడపాటి శ్రీనివాసరావు, సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, నూకల సురేంద్ర, రాము, సత్యం, సీహెచ్‌.మస్తాన్‌రెడ్డి, ప్రసాద్‌ రెడ్డి, వెంకట్రావు, అహ్మద్‌ బాషా, రావిపాటి రాంబాబు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశవరాజుకుంట సచివాలయ కార్యదర్శికి తాఖీదులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనర్‌ కె.వెంకటేశ్వరరావు గురువారం రెండు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేశవరాజుకుంట సచివాలయ అడ్మిన్‌ సెక్రటరీ పనివేళల్లో అందుబాటులో ఉండనందుకు, ఆస్తిపన్ను 22 శాతమే వసూలు చేసినందుకు గానూ సంజాయిషీ నోటీసు జారీ చేశారు. అనంతరం గాంధీరోడ్డు సచివాలయానికి వెళ్లి సిబ్బంది హాజరు పరిశీలించారు.

సమాచారం లేకుండా సభలపై ఫిర్యాదు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రామస్థులకు సమాచారం లేకుండా ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించారని ఎం.వేములపాడు పంచాయతీ వార్డు సభ్యుడు వడ్డెంపూడి శ్రీనివాసరావు, తెదేపా బూత్‌ కన్వీనర్‌ పమిడి వెంకటేశ్వర్లు ఈవోఆర్డీ రమణమ్మకు గురువారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి వ్యవహారశైలిపై ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్‌.ఎన్‌.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్‌ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మద్దిపాడు, న్యూస్‌టుడే:

?: చిన్నపాటి వర్షం పడినా మద్దిపాడు ఇస్లాంపేటలోని ఇళ్లలోకి మురుగు చేరి ఇబ్బందులు పడుతున్నాం. దోమల సమస్య తీవ్రంగా ఉంది. – షేక్‌ అబ్దుల్‌ సమద్‌, స్థానికుడు

✓: ముందుగా సిబ్బందిని పంపి కాలువలు బాగు చేయిస్తాం. వరద నీరు బయటకు వెళ్లే విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం.
– ఆశాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

?: ఏడుగుండ్లపాడులో జాతీయ రహదారికి తూర్పు వైపున ఉన్న వీధి దీపాలు పగలు సైతం వెలుగుతూ విద్యుత్తు వృథా అవుతోంది. – ఎం.వెంకట్రావు, గ్రామస్థుడు

✓: సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం.
– చెన్నారెడ్డి, విద్యుత్తు ఏఈ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే:

?: టి.అగ్రహారంలో కాలువల లేక ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. వర్షాల సమయంలో చెరువు నీరు సైతం... అలుగు ద్వారా వెళ్లే వీల్లేక గ్రామ రహదారులపై ప్రవహిస్తోంది.
– సాంబశివరావు, స్థానికుడు

✓ పరిశీలించి... అవసరమైన చర్యలు చేపడతాం.
– మహాలక్ష్మి, ఎంపీడీవో

మారిన చట్టాలపై అవగాహన అవసరం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు శిక్షణ కళాశాల సీఐ కరీముల్లా పేర్కొన్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళా చట్టాలు, సంరక్షణ విషయంలో చోటుచేసుకున్న సవరణలు తెలియజేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థినులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఆదిలక్ష్మి పేర్కొన్నారు. వ్యక్తిగత రక్షణ, క్రమశిక్షణ అవసరమని పేర్కొన్నారు. వైస్‌ ప్రిన్సిపల్‌ నిర్మలామణి, భారతీదేవి, ఎస్సైలు రాజారావు, రామానాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీసు శిక్షణ కళాశాల సీఐ కరీముల్లా

శస్త్రచికిత్స లేకుండా గుండె కవాటాల మార్పిడి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మూసుకుపోయిన గుండె కవాటాలను శస్త్రచికిత్స లేకుండా సరిచేశారు కిమ్స్‌ ఆసుపత్రి వైద్యులు. గుండెవైద్య నిపుణుడు కపిల్‌ కార్తికేయరెడ్డి... గురువారం ఆ వివరాలు తెలియజేశారు. ఇప్పటికే బైపాస్‌ సర్జరీ అయిన 76 ఏళ్ల వృద్ధుడికి మరోసారి సమస్య తలెత్తగా కుటుంబీకులు కిమ్స్‌కు తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అయోర్టిక్‌ వాల్వ్‌ అనే కవాటం పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఊపిరితిత్తుల సమస్య కూడా ఉండడంతో మళ్లీ శస్త్రచికిత్స చేస్తే ప్రాణాలకు ప్రమాదమని... అత్యాధునిక ట్రాన్స్‌కాథెటర్‌ ఆయోర్టిక్‌ వాల్వ్‌ రీప్లేస్‌మెంట్‌ విధానంలో చికిత్స చేశారు. సమావేశంలో చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ కె.అంకిరెడ్డి, ఈడీ టి.గిరినాయుడు, మెడికల్‌ డైరెక్టర్‌ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

